క్లుప్తంగా

రామకృష్ణ పరమహంస జన్మతిథి వేడుకలు



కర్లపాలెం: రామకృష్ణ పరమహంస బోధనలు అనుసరణీయమైనవని విశాఖపట్నం రామకృష్ణ మిషన్ స్వామి అధీశ్వరానంద మహరాజ్ తెలిపారు. స్థానిక రామకృష్ణ సేవా సమితిలో మంగళవారం రామకృష్ణ పరమహంస 188వ జన్మతిథి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామీ అధీశ్వరానంద మహరాజ్ ఆధ్వర్యంలో సుప్రభాతం, ధ్యానం, హారతి, నిత్యపూజ, అష్టోత్తర శతనామావళి పూజలు, పుష్పాంజలి సేవలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి వ్యవస్థాపకుడు కాటూరి వెంకటేశ్వరరావు, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తిమ్మరాజు వెంకటసుబ్బారావు, కార్యవర్గ సభ్యులు ఆరే వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, నటరాజన్, బాపిరాజు, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఎంపీ మోపిదేవి ఆర్థికసాయం



రేపల్లె: పట్టణంలోని ఆరోవార్డులో నివాసముంటున్న గోలి వాసవి అనే మహిళ భర్త ఇటీవల రహదారి ప్రమాదంలో మృతి చెందాడు. అయితే వాసవీ తన ఇరువురు చిన్నారులు చదువు మధ్యలోనే ఆగిపోకూడదన్న సంకల్పంతో కూలిపనులు చేసుకుంటూ చదివిస్తోంది. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు వాసవీ కుటుంబానికి చేయూతనందించారు. చిన్నారుల చదువుకై రూ.25వేలు అందించారు. భవిష్యత్‌లోనూ వీరి చదువుకు అండగా నిలుస్తానని భరోసానిచ్చారు.

కొలతల్లో వ్యత్యాసం లేకుండా చూడాలి



నగరం: ఆయిల్ బంకులకు వచ్చే వినియోగదారులకు కొలతలలో వ్యత్యాసం లేకుండా చూడాలని సివిల్ సప్లయీస్ డెప్యూటీ తహసీల్దార్ డి.వెంకటేశ్వరావు చెప్పారు. మండల కేంద్రమైన నగరంలోని ఆయిల్ బంకులను మంగళవారం సీఎస్ డీటీ తనిఖీ చేసి మాట్లాడారు. వినియోగదారులకు పెట్రోల్, డీజిల్‌కు సంబంధించి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. కొలతలలో తేడాలు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులు రీడింగ్‌లు చూసుకోవాలని, తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి మహిళలకు ఉపాధి శిక్షణ తరగతులు

రేపల్లె రూరల్: మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్, ఎలిప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పలువురు దాతలు పరిమి బాలాజీ (కాలిఫోర్నియా), మమతల సహకారంతో పట్టణంలోని గుత్తికొండ లక్ష్మీ నారాయణ కల్యాణమండపంలో మార్చి 1వతేదీ నుంచి మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంసీఏ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వి.ప్రకాశరావు తెలిపారు. స్థానిక ఎంసీఏ హాల్లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉచిత కుట్టుశిక్షణ, జూట్ బ్యాగ్‌ల తయారీ, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్స్‌లపై రెండు నెలలు పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ నెల 26 తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9849604205 నంబరును సంప్రదించాలన్నారు. అదేవిధంగా పట్టణంలోని విజ్ఞాన్ కళాశాలలో చదువుతూ ఎన్‌సీసీ అండర్ ఆఫీసర్‌గా ఎన్నికైన విద్యార్థి షేక్ అశ్విల్ అహ్మద్‌కు 25వతేదీన సన్మానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంసీఏ కార్యదర్శి జి.బాపారావు, సభ్యులు వాసుదేవరావు, లక్ష్మీనారాయణ, వేజళ్ల చక్రపాణి, కేవీ సుబ్బారావు ఉన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం

జంపని(వేమూరు): పదో తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని జడ్పీటీసీ గాజుల హేమలత తెలిపారు. జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం మంగళవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచి చుండూరు పెదమరియమ్మ, ఎంపీటీసీ షేక్ బాజీల సహకారంతో ప్రతి రోజు సాయంత్రం విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. హెచ్ఎం బద్రినారాయణ, వేమూరు కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గాజుల భానుప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యమైన భవితకు బాటలు

- మండలానికో భవిత కేంద్రం
- విద్యతో పాటు ఫిజియోథెరపీ సేవలు
- మానసిక దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు



భట్టిప్రోలు భవిత కేంద్రంలో చిన్నారికి ఫిజియోథెరపీ చేయిస్తున్న దృశ్యం (ఫైల్)

భట్టిప్రోలు: దివ్యాంగుల భవితకు ప్రభుత్వం బాటలు వేస్తుంది. మండల కేంద్రాల్లో ప్రత్యేకంగా భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి వారిని వివిధ అంశాలలో సాధారణ పిల్లల మాదిరిగా తీర్చిదిద్దుతుంది. సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహిస్తుంది. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు సాధారణ పిల్లలతో కలిసి సాగేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఐఈఆర్టీలకు ఆదేశాలు జారీ చేసింది. నాన్ భవిత కేంద్రాలైన భట్టిప్రోలు, వేమూరు, కొల్లూరు, అమృతలూరు, చుండూరు మండలాల్లో వారంలో ఒక రోజు వైద్య సిబ్బంది ఫిజియోథెరపీ క్యాంపులు నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గంలో ఐదు కేంద్రాలు..

వేమూరు నియోజకవర్గంలో ఐదు భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 74 మంది విద్యార్థులు ప్రతి నిత్యం భవిత కేంద్రాలకు వస్తుండగా, కొందరు ఇంటి వద్ద, మరి కొందరు ఇతర పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ప్రస్తుతం ఐదు కేంద్రాల్లో తొమ్మిది మంది ఐఈఆర్టీలు, ఐదుగురు ఆయాలు ఉన్నారు. ఈ కేంద్రాలకు వారానికి ఒకసారి ఫిజియోథెరపీ డాక్టర్లు వచ్చి వ్యాయామం చేయిస్తారు. మిగతా సమయాల్లో వారికి ఇంట్లో వ్యాయామం ఎలా చేయాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.

మండలాల వారీగా భవిత కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య

భట్టిప్రోలు	18
కొల్లూరు	17
అమృతలూరు	18
వేమూరు	8
చుండూరు	13

ప్రతి శనివారం కదలలేని పిల్లల ఇళ్లకు వెళ్లి ఫిజియోథెరపీ చేసి ఆరోగ్య జాగ్రత్తలు చెబుతారు.

వివిధ రూపాల్లో సహాయం

భవిత కేంద్రాల పిల్లలకు ప్రభుత్వం పలు విధాలుగా సహాయ పడుతుంది. ఉచితంగా విద్య, ఫిజియోథెరపీ అందించడంతో పాటు కేంద్రానికి వచ్చే వారికి, ఇంట్లో ఉన్న బాలబాలికలకు రూ.250 వంతున 10 నెలలపాటు అలవెన్స్ అందిస్తుంది. అలాగే ఎస్కార్ట్ అలెవెన్స్ కింద 10 నెలలకు రూ.3 వేలు వంతున అందజేస్తుంది. దివ్యాంగులు, మానసిక వికలాంగులకు ప్రత్యేకంగా 10 నెలల కాలానికి రూ.3 వేలు స్టయిఫండ్ రూపంలో అందజేస్తుంది. మానసిక వికలాంగులకు రూ.14 వేలు విలువైన ఎమ్మార్ కిట్స్, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు హియరింగ్ మిషన్, చక్రాల కుర్చీలు తదితర వాటిని ఉచితంగా పంపిణీ చేస్తుంది.

ఇతర పిల్లలతో మెలిగేలా అవగాహన...

దివ్యాంగులు అందరి పిల్లలతో మెలిగేలా అవగాహన కల్పిస్తున్నాం. వారి జీవిత కాలం పెంచేందుకు కృషి చేస్తున్నాం. వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు శిక్షణ ఇస్తున్నాం.

–కె. రత్నాకర్, ఐఈఆర్టీ, భట్టిప్రోలు



మార్పు తెచ్చేందుకు కృషి..

దివ్యాంగులకు అన్నిరకాల వసతులు అందజేస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ అందించి దివ్యాంగుల్లో మార్పు వచ్చేందుకు కృషి చేస్తున్నాం.

–పులి లాజర్, భట్టిప్రోలు ఎంఈఓ



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

గ్రామ వలంటీర్లు, గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే కోన రఘుపతి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత గ్రామ, వార్డు వలంటీర్లు, గృహసారథులపై ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. కర్లపాలెం పెద్దింటమ్మ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన గ్రామ వలంటీర్ల, గృహసారథుల సంయుక్త శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశనం చేశారు. గ్రామ వలంటీర్లు, గృహసారథులు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆకుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఇప్పటి వరకు అందిన సంక్షేమ పథకాలను వివరంగా తెలియజేయాలని చెప్పారు. గత ప్రభుత్వంలో ఎలాంటి పథకాలు అందాయి. ఈ ప్రభుత్వంలో ఎటువంటి పథకాలు అందాయి వాటి వలన ఎంత వరకు లబ్ధి చేకూరింది. అనే విషయాలను ప్రజలకు సమగ్రంగా తెలియజేయాల్సిన బాధ్యతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లు, గృహసారథులపై ఉంచారని ఎమ్మెల్యే కోన తెలిపారు. బాపట్ల నియోజకవర్గం పరిశీలకుడు జి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ లభిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థంగా వివరించటం ద్వారా వారి మద్దతుతో రాష్ట్రంలో 175 స్థానాలను వైఎస్సార్ సీపీ గెలుచుకోవటం కష్టమేం కాదని తెలిపారు. పార్టీ కర్లపాలెం మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, బాపట్ల రూరల్ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరెడ్డి, సొసైటీ చైర్మన్ మరకా పెదవెంకటేశ్వర్లు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు, కాతి బుల్లియ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చందోలులో...

చందోలు(కర్లపాలెం): గ్రామ వలంటీర్లు, గృహసారథులు కలిసి ప్రతి గడపకూ వెళ్లి ఆ కుటుంబానికి ఇప్పటి వరకూ అందిన సంక్షేమ పథకాలను వివరించాలని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. చందోలు గ్రామంలో మంగళవారం జరిగిన వలంటీర్ల, గృహసారథుల సంయుక్త శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలును, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న మేలును ప్రజలకు వివరించాలని చెప్పారు. బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త జి.బ్రహ్మారెడ్డి జీఎస్‌డబ్ల్యూఎస్ రీజనల్ కో–ఆర్డినేటర్ కె.రవీందర్‌రెడ్డిలు మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వలంటీర్లు, గృహసారథులు అంకిత భావంతో నిర్వహించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ పిట్లలవానిపాలెం మండల అధ్యక్షుడు, ఎంపీపీ ఎస్‌కే బాజీ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు చేబ్రోలు కృపానందం, దెందుకూరి సీతారామరాజు, సచివాలయాల కన్వీనర్ సురేష్, సొసైటీ చైర్మన్ మండే విజయ్‌కుమార్, రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ డైరక్టర్ ఎస్కె హుస్సేన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చేసిన మంచిని ప్రతి ఇంటికెళ్లి చెప్పండి

గృహ సారథుల సమావేశంలో మంత్రి మేరుగ నాగార్జున



గృహ సారథులు, వలంటీర్లు, కన్వీనర్లతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు: సంక్షేమ పథకాలు ఫలితాలు అమలు తీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకునే బాధ్యత గృహ సారథులకు అప్పగించడం జరిగిందని, చేసిన మంచిని ప్రతి ఇంటికీ చెప్పాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరు నాగార్జున చెప్పారు. వేమూరు మార్కెట్ యార్డులో గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు, గృహ సారథులతో మానమ్మకం నువ్వే జగనన్న మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి తెలుసుకునేందుకు గ్రామ సచివాలయాల కన్వీనర్, వార్డు వలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అమలు గురించి తెలియజేయాలన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, ఇప్పటి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల మధ్య వ్యత్యాసం గురించి ప్రజలకు వివరించాలని ఆయన చెప్పారు. టీమ్ సభ్యులు ప్రతి రోజు 10 నుంచి 15 గృహాలను సందర్శించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అందరూ సమష్టి కృషి చేసి, బాధ్యతగా పని చేయాలని ఆయన కోరారు. గృహ సారథులతో మండల స్థాయి సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గృహ సారథుల బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు. అనంతరం గృహ సారథులు, గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయం సిబ్బంది చేత ప్రమాణం చేయించారు. ఎంపీపీ యల్లమాటి మోహన్, జడ్పీటీసీ గాజుల హేమలత, గ్రామ సర్పంచి సజ్జా లక్ష్మీ తిరుతమ్మ, మండల గ్రామ సచివాలయం కన్వీనర్ దాది సుబ్బారావు, మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు షేక్ బాజీ, మండల కో–ఆప్షన్ మెంబరు తలతోటి సువర్ణరావు, మాజీ ఎంపీపీ బొల్లిశెట్టి ప్రభాకరరావు, దున్నా మేరీసుబాబు, విష్ణుమొలకల వెంకట రెడ్డియ్య గాజుల మోహన్, ఎంపీటీసులు గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మహిళా రైతు సంఘాలను బలోపేతం చేయాలి

కర్లపాలెం: మహిళా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలను బలోపేతం చెయ్యాలని జిల్లా ఎఫ్‌పీఓ ఏపీఎం కె.రామకృష్ణ తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో రామకృష్ణ మంగళవారం మండల సమైక్య సభ్యులతో, వెలుగు సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మహిళా రైతు ఉత్పత్తిదారుల కో–ఆపరేటివ్ వ్యవసాయ సహకార సంఘాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీని ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తామన్నారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 108 మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఒక్కొక్క సంఘంలో 12నుంచి 19మంది మహిళా రైతులు ఉంటారని ఆయన తెలిపారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ ధనలక్ష్మి, కార్యదర్శి డి.నాగలక్ష్మి, ఎఫ్‌పీఓ సమన్వయ కర్త పూర్ణచంద్రరావు, సీసీలు పాల్గొన్నారు.

నాడు-నేడుతో విద్యా రంగానికి పెద్దపీట


మంత్రి మేరుగ నాగార్జున



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: నాడు-నేడు పథకంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేసిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమాత్యులు మేరుగ నాగార్జున తెలిపారు. మంగళవారం రాత్రి కర్లపాలెం హైవెండ్ హైస్కూల్‌లో జరిగిన సిల్వర్ జూబ్లీ వేడుకలలో మంత్రి మేరుగ నాగార్జున ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే కోన రఘుపతితో కలసి మంత్రి మేరుగ నాగార్జున జ్యోతి ప్రజ్వలన చేసి సిల్వర్ జూబ్లీ వేడుకలను ప్రారంభించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు మంత్రి మేరుగకు ఎమ్మెల్యే కోనకు ఘనంగా స్వాగతం పలికారు. సభలో మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో 25ఏళ్లుగా పాఠశాల నిర్వహిస్తూ విద్యార్థుల, తల్లిదండ్రుల ఆదరాభిమానాలు చూరగొన్న కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందనీయులన్నారు. రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పథకంతో మౌలిక వసతులు కల్పించటంతో పాటు ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల వలన ఏ విద్యార్థి చదువుకు దూరం కారాదని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఏట్రవారిపాలెం సర్పంచి చీరాల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు, ఎన్ఆర్ఐ బొంతు నాగిరెడ్డి, పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు పెదమల్లు ఉదయచంద్రరావు, విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మొక్కజొన్న పంటల పరిశీలన



అద్దేపల్లి(భట్టిప్రోలు): రబీ సాగులో భాగంగా మొక్కజొన్నలో పెరుగుదల చాల తక్కువగా ఉన్నట్లు గమనించామని రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలోని పంట పొలాలను వ్యవసాయ శాఖాధికారి గొల్లపోతు మీరయ్యతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ ఇందుకు గాను అర లీటర్ యూరియా ద్రావణం, అర లీటరు వేపనూనె కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. లేదా 19-19-19 అర కిలో ఒక ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. ఎక్కడైనా పురుగు కనిపించినట్లయితే ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. ఏఓ మీరయ్య మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల నేలలో సారం తగ్గిపోయి భూములు చౌడుగా మారుతున్నాయని చెప్పారు. రైతులు ఇది గమనించి ఎరువులు తగు మోతాదులో సిఫారసు మేరకే వాడాలని తెలిపారు. అద్దేపల్లి వీఏఏ ఎస్.రజని, రైతులు పాల్గొన్నారు.